
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5 జనగామ
గురువారం 7 నవంబరు 2024

'సదర్' అదుర్స్

- గోకుల్‌నగర్‌లో అంబరాన్నంటిన సంబరం
- విరజిమ్మిన విద్యుత్ కాంతులు.. అలరించిన ఆట పాట
- ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల విన్యాసం
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

7



మూడేళ్లలో..

నెరవేరనున్న ఓరుగల్లువాసుల గగనయాన కల



ఓరుగల్లు వాసుల గగన యానం కల నెరవేరబోతోంది. వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న 150కి.మీల నిబంధన సడలింపునకు జీఎంఆర్ సంస్థ అంగీకరించిందనే ప్రకటనతో ఆకాశ యానంపై ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రుల వరుస ప్రకటనలు.. అధికారులతో నిర్వహిస్తున్న సమీక్షలతో మరో మూడేళ్లలో కాకతీయ గడ్డపై నుంచి విమానం ఎగురుతుందనే ధీమా సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టుకు 700 ఎకరాల భూమిని అప్పగించగా, మరో 300ఎకరాల భూమిని కేటాయించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వాన్ని కోరింది. అయితే హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణపై దృష్టి పెట్టింది. వరంగల్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టి 2027-28 నాటికి అందుబాటులోకి తేవాలని కసరత్తు చేస్తోంది.



- మంత్రుల వరుస ప్రకటనలతో చిగురిస్తున్న ఆశలు
- మామునూరు విమానాశ్రయ పూర్తికి ప్రభుత్వం కసరత్తు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- 150కి.మీల నిబంధన సడలింపునకు జీఎంఆర్ అంగీకారం
- ఇప్పటికే స్కై అండ్ ల్యాండ్ సర్వే పూర్తిచేసిన ఏఏఐ
- భూసేకరణపై సర్కారు దృష్టి.. పరిసర ప్రాంతాల రైతులతో చర్చలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నిజాం కాలంలోనే రయ్ రయ్ మంటూ గాలిలో ఎగిరిన మామునూరులో.. నేటి తరానికి గగన ప్రయాణం అందుబాటులో లేకుండా పోయింది. 1930లో చివరి నిజాం మీర్ ఉస్మాన్‌ఆలీ ఖాన్ మామునూరులో విమానాశ్రాయం ఏర్పాటు చేశారు. షోలాపూర్‌లోని వ్యాపారాభివృద్ధికి, ఆజంజాహి వస్త్ర పరిశ్రమ, కాగజ్‌నగర్ కాగితపు పరిశ్రమలకు ఉపయోగపడేలా దీన్ని ఏర్పాటు చేశారు. 1981 వరకు మామునూరు విమానాశ్రాయం ద్వారా రాకపోకలు జరిగాయి. 1970లో భారత్, చైనా మధ్య జరిగిన యుద్ధం నేపథ్యంలో ఢిల్లీలో విమానాలు ల్యాండ్ అయ్యే పరిస్థితి లేనప్పుడు కూడా మామునూరు నుంచే సైన్యాన్ని పంపించారు. కార్గిల్ యుద్ధ సమయంలో కూడా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా మామునూరు ఎయిర్‌పోర్టును వాడుకునేందుకు సిద్ధం చేశారు. అంతటి చరిత్ర ఉన్న మామునూరు విమానాశ్రయం 1981 తరువాత ఓరుగల్లువాసులకు మాత్రం ఉపయోగపడటం లేదు. కానీ పాతికేళ్ల తరువాత ఈ విమానాశ్రయం విషయంలో కదలిక వచ్చింది. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో మరో మూడేళ్లలో వరంగల్‌లో విమానం ఎగరబోతోందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

150కి.మీల నిబంధన తొలిగినట్టే

హైదరాబాద్ శంశాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధనను పెట్టుకుంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరుకు మధ్య దూరం 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా అభ్యర్థన చేస్తూనే వచ్చింది. కానీ ఆ సంస్థ తన నిబంధనను సడలించేందుకు సానుకూలత వ్యక్తం చేయలేదు. దీంతో వరంగల్ ఎయిర్‌పోర్టు పనులు ముందుకు సాగటం లేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ ఎయిర్‌పోర్టుపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ

మిగతా 7లో...

ఎయిర్‌పోర్టుకు త్వరితగతిన భూసేకరణ చేయాలి

- ప్రతీ 15రోజులకోసారి సమీక్షిస్తాం
- ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వరంగల్ ఎయిర్ పోర్టుకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని, రైతులను ఒప్పించి సమీకరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై బుధవారం ఆయన సచివాలయంలోని తన చాంబర్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్, స్పెషల్ సెక్రెటరీ దాసరి హరిచందనతో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ ఎయిర్ పోర్టులో తాత్కాలిక ఏర్పాట్లకంటే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణ పనులు చేపట్టాలని, గత ప్రభుత్వం మాదిరిగానే హామీలతో కాలం గడిపితే అర్థం ఉండదన్నారు. ఈ విమానాశ్రయ నిర్మాణం విషయమై ప్రతీ పదిహేను రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉడాన్ పథకంలో వరంగల్ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేసి, పెద్ద పట్టణాలకు వరంగల్ నుంచి ఎయిర్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని కోరారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు భద్రకాళి, వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కోట, ఇతర కాకతీయ కట్టడాలు, మెగా టెక్స్‌టైల్ పార్కు అవసరాలు, భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దాలని మంత్రి అధికారులకు సూచించారు.



వరంగల్ విమానాశ్రయ నిర్మాణంపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కడియం

ప్రజలు ఎన్యుమరేటర్లకు సహకరించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే



సర్వేలో సూచనలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా జనగామ మునిసిపాలిటీ పరిధిలోని వీవర్స్ కాలనీ, గిర్నిగడ్డ, కురుమవాడలో సర్వే జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ద్వారా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఎవరికీ సమాచారాన్ని వెల్లడించడం జరగదని, ప్రజలు వివరాలు ఇచ్చే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తుందని, అందువల్ల తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారం ఇస్తే భవిష్యత్తులో వివిధ సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు ఇళ్లను సందర్శించి జాబితా రూపొందించడం జరుగుతుందని, అనంతరం ప్రభుత్వం ఇచ్చే ఫారం ప్రకారం వివరాలు సేకరిస్తారన్నారు. ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్ అతికించాలని పేర్కొన్నారు. సర్వే ఫారంలో పూర్తి వివరాలు నింపాలని, ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు సేకరించిన డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీకాల లక్ష్యం వంద శాతం సాధించాలి

జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు



దేవరుప్పుల పీహెచ్‌సీలో వైద్యాధికారి పూజతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్‌రావు

దేవరుప్పుల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల టీకాల లక్ష్యం వంద శాతం సాధించి జిల్లా ర్యాంకింగ్ రేటు పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం దేవరుప్పులలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గర్భిణుల టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ సేవల గురించి రివ్యూ చేస్తూ ఐపీ, ఓపీ, ఎన్‌సీడీ సేవలు పెంచాలని, పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ఆరోగ్య

మిగతా 8వ పేజీలో...

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



చిలుపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో సూచనలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

చిలుపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాకులు చూపి రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) రోహిత్‌సింగ్ నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని మల్కాపూర్, రాజవరం, వెంకటాద్రిపేట, చిలుపూర్ తదితర గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో ఉన్న రిజిస్టర్లతో పాటు, ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా సేకరించడంతో పాటు కాంటా అయిన వెంటనే మిల్లుకు తరలించి వివరాలన్నింటిని యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులకు అందుబాటులో టార్పాలిన్ షీట్లను ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, నాయబ్ తహసీల్దార్ రామారావు, ఎమ్మార్ఐ కలువల శ్రీనివాస్, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఈజీఎస్ ఏపీవో ఈద రమేష్ కుమార్, సీసీలు గట్టు శ్రీనివాస్, కనకచంద్రం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

- బచ్చన్నపేట: మండలంలోని కొడవటూరు, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ రోహింత్‌సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. ధాన్యంను తేమ శాతం మిషన్‌తో పరిశీలించారు. కాంటా వేసిన బస్తాలను వెంటనే తరలించేలా నిర్వాహకులు చొరవ చూపాలన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. క్రమ పద్ధతిలో టోకెన్‌లు ఇచ్చి కాంటాలు వేయాలన్నారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు, సీసీ సత్యనారాయణ, నిర్వాహకులు గంగం వాణి, నిర్మల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.
- నర్మెట: మండలంలోని కన్నెబోయినగూడెం, వెల్దండ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.. ఇంకా ధాన్యం ఎంత వచ్చే

మిగతా 8వ పేజీలో..

సోమన్న ఆలయంలో బహిరంగ వేలం

సమకూరిన రూ.31 లక్షల ఆదాయం

పాలకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు, కొబ్బరి చిప్పలకు వేసిన బహిరంగ వేలం ద్వారా రూ.31లక్షల 5వేల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో మోహన్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఆలయ కల్యాణ మండపంలో బుధవారం కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యములు, కొబ్బరి చిప్పలు అమ్ముకొనేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన వందన సోమయ్య రూ.25లక్షల 50వేలు వేలం పాడి కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యములు విక్రయించుకునే హక్కును దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. పాలకుర్తికి చెందిన రంప నరేందర్ కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు రూ.5లక్షల 55వేలు హెచ్చు వేలం పాడి అమ్ముకునే హక్కు దక్కించుకున్నాడని తెలిపారు. కాగా, తలనీలాలు పోగు చేసుకునే వేలం వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

- వాకింగ్‌కు వెళ్తుండగా వాహనం ఢీ



ఎల్లయ్య (ఫైల్)

రఘునాథపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన రఘునాథపల్లిలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన చింతకింది ఎల్లయ్య(60) అనే వృద్ధుడు జాతీయ రహదారిపై రోజు మాదిరిగా వాకింగ్‌కు వెళ్లగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలు కాగా, జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య వరమ్మ, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జీపీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు మాట్లాడుతూ జీపీ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నెల నెలా సిబ్బంది అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లాచారి, పి.మల్లేశం, రామ్‌నారాయణ, డి.పాండురంగం, ఎ.వెంకట్‌రెడ్డి, ఐలయ్య, గుర్రపు లాజర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో జాతీయ స్థాయి గుర్తింపు

- నిత్యం గంటపాటు శ్రమిస్తే శారీరక దృఢత్వం సాధ్యం
- పిల్లలను క్రీడల వైపు తల్లిదండ్రులు ప్రోత్సహించాలి
- సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి



సైక్లింగ్ పోటీల ముగింపు సభలో మాట్లాడుతున్న తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి

వివరాలు 6లో..



సీతారాంపురంలో సమావేశం నిర్వహిస్తున్న కేంద్ర బృందం

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

దేవరుప్పుల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం, ధర్మగడ్డతండాలో బుధవారం జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం సభ్యులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సీతారాంపురంలో ఈజీఎస్ ద్వారా చేపట్టిన క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం, నర్సరీ, రోడ్లు తదితర పనులను పరిశీలించారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు ప్రతీ వారం పనులు చేసినా వేతనాలు సక్రమంగా అందుతున్నాయా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఐకేపీ ద్వారా గ్రామాల్లో స్వయం సహాయక బృందాల సభ్యులకు ఇచ్చిన పలు రకాల రుణాలు, స్కీంలు తదితర వాటిని పరిశీలించారు. గ్రామంలోని షాప్స్, మిల్లులు తిరిగి చూసి లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. షాపుల నిర్వహణ సక్రమంగా ఉందా.. లేదా? ప్రతీ నెల రుణం కడుతున్నారా.. అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం అధికారులు జుబైర్ కిబీస్, జెస్సీ లారెన్స్, జిల్లా అధికారులు ఏడీ ఆర్డీవో చంద్రశేఖర్, డీపీఎం వినీత, సీటీప శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏపీవో శ్రీనివాస్, ఎంపీవో సురేష్‌కుమార్, ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఈసీ మోహన్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, యాదగిరి, రాంచెంద్రం, వసంత, సీఏలు సోమలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి 90వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 2 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

నేతకానీల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నికృష్ణ

వాజేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీవర్గీకరణను ప్రభుత్వం అమలుచేస్తే నేతకానీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కావేరి చిన్నికృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో సంఘం మండల అధ్యక్షుడు చెన్నూరు వినోద్ అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రామసభలో చిన్నికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేతకాని కులాన్ని ఏ కేటగిరీలో చేర్చాలన్నారు. కొంతమంది అగ్రవర్ణ ఎస్సీ రాజకీయ నాయకులు నేతకాని కులం పట్ల వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య, సీనియర్ నాయకుడు బొత్ మల్లయ్య, జిల్లా నాయకులు భగత్ నరేందర్, గణపతి, సమ్మయ్య, మావూరి వెంకటయ్య, జనగాం గంగరాజు, గోగు తిరుపతి, దుర్గం నవీన్, గజ్జల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న చిన్నికృష్ణ

క్రీడలతో జాతీయ స్థాయి గుర్తింపు

- రోజూ గంట శ్రమిస్తే శారీరక దృఢత్వం
- పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలి
- సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి



సైక్లింగ్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందిస్తున్న మల్లారెడ్డి

లింగాలఘణపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించే క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. బుధవారం లింగాలఘణపురం మండల కేంద్రంలో జరిగిన 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్-2024 పోటీల ముగింపు కార్యక్రమానికి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైక్లింగ్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులను అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే సైక్లింగ్ పోటీలకు సైతం 500-600 మంది క్రీడాకారులు హాజరవుతారని, కానీ జనగామ జిల్లాలో నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి పోటీలకు 380 మంది క్రీడాకారులు హాజరుకావడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని, అప్పుడే తమ కీర్తి ప్రతిష్ఠలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతాయన్నారు. ఆస్తులు, అంతస్తులు కేవలం తాత్కాలికం మాత్రమేనని వాటితో గుర్తింపు అసాధ్యమని, కానీ క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు సాధ్యపడుతుందన్నారు.

ప్రపంచంలో క్రికెట్ క్రీడాకారులు అత్యంత సంపన్నులుగా నిలుస్తున్నారని, ఆ తర్వాత షటిల్ క్రీడాకారులు కోటీశ్వరులుగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. యువత ప్రతీ రోజు ఒక గంట సేపు మైదానంలో వ్యాయామం చేయగలిగితే ఆరోగ్యపరంగా సంపన్నుల జాబితాలో నిలుస్తారన్నారు. ప్రతీ తల్లిదండ్రి తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించగలిగినప్పుడే సమాజంలో ఆదర్శవంతులుగా గుర్తింపబడుతారన్నారు. క్రీడా రంగంలో గెలుపోటములు, సహజమని, నేటి ఓటమి రేపటి విజయానికి నాందిగా నిలుస్తుందన్నారు. ఓటమిని పాఠంగా స్వీకరించగలిగే ప్రతీ క్రీడాకారుడు గెలుపు తీరాలను తప్పకుండా తాకి తీరుతారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాష్ యాదవ్, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్‌రెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్, జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్, మ్యాక్స్‌వెల్ ట్రెవర్, దత్తాత్రేయ, కిషన్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సైక్లింగ్ పోటీలు

లింగాలఘణపురం మండల కేంద్రంలో రెండు రోజులుగా అట్టహాసంగా సాగిన 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలు బుధవారంతో ముగిశాయి. 26 జిల్లాలకు చెందిన 382 మంది క్రీడాకారులకు మండల కేంద్రం క్రీడా వేదికగా నిలిచింది. అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో అండర్-14, అండర్-16, 4కి, 10కి, 16కి, బాలికల విభాగం, బాలుర విభాగంలో గెలుపొందిన విజేతలను నిర్వాహకులతో పాటు మండల ప్రజలు అభినందనలతో ముంచెత్తారు.

రెండు రోజులుగా లింగాలఘణ పురం- జనగామ రోడ్డును సైక్లింగ్ ట్రాక్‌గా మార్చిన అధికారులు రాకపోకలను దశల వారీగా నిలిపి వేశారు. దీంతో మండల ప్రజలు, వాహనదారులు క్రీడాకారులకు మద్దతుగా నిలిచి ప్రత్యామ్నాయ రోడ్ల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. మండలంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా స్థానిక ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ భారీ బందోబస్తు నిర్వహించి క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు.

బుగులోని జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బుగులోని వెంకటేశ్వరస్వామి జాతరను ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. బుగులోని జాతర నిర్వహణపై సమీక్షించారు. జాతరకు భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా అందుకు తగ్గ ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన చేయాలన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాకు తక్షణమే ఏర్పాట్లు చేయాలన్నారు. రహదారుల వెంబడి పిచ్చి మొక్కలను తొలగించాల న్నారు. జాతరకు అధిక సంఖ్యలో బస్సులను నడపాలని, అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈనెల 11 వరకు జాతర పనులను పూర్తి చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటుతో పాటు అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు.

భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వెంకటేశ్వరపల్లి నుంచి భక్తులు జాతరకు ఎడ్ల బండ్లపై వస్తుంటారని, రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని డీపీవో నారాయణరావుకు సూచించారు. సమావేశంలో అటవీ శాఖ జిల్లా అధికారి వసంత, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ



సమావేశంలో మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ డిమాండ్ చేశారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో కేజీకేఎస్ జిల్లా కమిటీ సమావేశం కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎం.వి.రమణ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు.

ప్రమాదాలు జరిగి వందలాది మంది క్షతగాత్రులు కావడం, మరణించడం జరిగిందన్నారు. సంవత్సరానికి 550 మంది చెట్టుపై నుంచి జారి పడుతున్నారని, 180 మంది చనిపోతున్నారన్నారు. ప్రమాదాలు నివారించేందుకు కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్టులను కల్లు గీత వృత్తి చేసే వారందరికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, కమ్మగాని నాగన్న, కనకటి రాజయ్య, పరీదుల భాస్కర్, జొన్నగాని శ్రీనివాస్, వడ్లకొండ వెంకటేశ్, బసవగాని మహేందర్, మార్క ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భవిచ్ఛిత్తి మాత్రలు వేసుకున్న మహిళకు అస్వస్థత

- గుట్టు చప్పుడు కాకుండా వైద్యం చేసిన ఆర్‌ఎంపీ
- ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితురాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో ఘటన వెలుగులోకి

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గర్భవిచ్ఛిత్తి మాత్రలు వేసుకున్న ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరిన ఆమె వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

భూపాలపల్లి మండలం అటవీ ప్రాంతంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు ఇప్పటికే ఇద్దరు సంతానం ఉండగా.. అనుకోకుండా మరోసారి గర్భం దాల్చింది. దీంతో అబార్షన్ చేయించుకోవాలని నిర్ణయించుకున ఆమె, ఆమె భర్త స్థానిక ఆర్‌ఎంపీని ఆశ్రయించారు. అతడి సూచనతో 15 రోజుల క్రితం భూపాలపల్లి పట్టణంలోని ఓ మెడికల్‌షాపులో కొనుగోలు చేసిన గర్భవిచ్ఛిత్తి మాత్రలు వేసుకుంది. దాంతో ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో మళ్లీ అదే ఆర్‌ఎంపీ దగ్గరకు వెళ్లగా అతడు చికిత్స చేశాడు. అయినా రక్తస్రావం ఆగకపోవడంతో కాటారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆ మహిళను తరలించారు.

అయినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆమెను మంగళవారం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే ఆమె అపస్మారక స్థితికి చేరుకుందని, ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని సమాచారం. ఎంజీఎం వైద్యులు ఆ మహిళ స్థితిని తెలంగాణ వైద్యమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అయితే ఇటీవల ములుగు జిల్లాకు చెందిన ఇద్దరు, సిద్దిపేట జిల్లాకు చెందిన ఒకరు గర్భవిచ్ఛిత్తి కోసం ప్రయత్నించి ప్రాణాలపైకి తెచ్చుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపగా భూపాలపల్లి జిల్లాలో వెలుగులోకి వచ్చిన తాజా ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

కేసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల శివారు గాంధీనగర్ సమీపంలో బుధవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం...కల్వల గ్రామానికి చెందిన నాంపల్లి సతీష్ బైక్‌పై మహబూబాబాద్ నుంచి వస్తుండగా కోమటిపల్లి శివారు రాంలాల్‌తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ గంగమ్మ భర్త రమావత్ స్వామి మరో బైక్‌పై మహబూబాబాద్ వైపునకు వెళుతున్నాడు. ఈ రెండు బైక్‌లు మూలమలుపు వద్ద ఢీకొనడంతో స్వామికి కాలు విరగగా సతీష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బస్టాండ్ మరమ్మతు పనులు నత్త నడక

- మరిపెడలో రోడ్డుపైనే బస్సుల నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

మరిపెడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ బస్టాండ్ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు మొదలు పెట్టి నెలలు గడుస్తున్నా వాటిని పూర్తి కాకుండానే వదిలేశారని ఆరోపణలు వస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బస్టాండ్‌లోని బస్సుల స్టాండింగ్ కోసం చేపట్టిన సీసీ పనులు, బస్టాండ్ మరమ్మతుకు రూ.34 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనుల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంత పని చేసి మిగిలిన వాటిని వదిలేసి పోవడంతో రోడ్డుపైనే ప్రయాణికులు బస్సుల రాకపోకల కోసం చలి, ఎండలో నిరీక్షిస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో బస్సులు రోడ్డుపై నిలిపివేస్తుండంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ అంతరాయం కలిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో చలికి వణికిపోతుండగా, మధ్యాహ్నం ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నిలిచిన పనులు సత్వరం పూర్తి చేసి బస్సులను బస్టాండ్‌లోకి పంపి ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని వివిధ ప్రాంతాల నుంచి ఈ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు అధికారులను వేడుకుంటున్నారు.

కాగా, గత ఆగస్టు 31న కురిసిన భారీ వర్షంతో పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి దగ్గర ఏర్పడిన అంతరాయంతో మానుకోట, సూర్యాపేట డిపో బస్సులు పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వరకే నడిపిస్తున్నారు. దీంతో మహబూబాబాద్, సూర్యాపేట వరకు వెళ్లే ప్రయాణికులు కిలోమీటరు దూరం నడిచి బస్సుల్లో వెళ్తున్నారు. ఆ బ్రిడ్జిపై రాత్రి భారీ వాహనాలు నడుస్తున్నాయని, వాటికి లేని ఇబ్బంది ఒక్క బస్సులకే ఎందుకు అని ప్రయాణికులు మండిపడుతున్నారు. మహబూబాబాద్ డిపో మేనేజర్ శివప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వాటర్ క్యూరింగ్ జరుగుతుందని, ప్రాసెసింగ్ టైమ్ వరకు పనులు పూర్తి చేయ కుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.



మరిపెడ బస్టాండ్



రోడ్డుపై నిలిపిన బస్సు

ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్ల ఆహ్వానం

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగించుకోవడంపై 2024లో ఓటర్ల అవగాహన పెంపొందించి, చైతన్యపరచడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించిందని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా హౌస్ నుంచి 2024 సంవత్సరానికి గాను ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ అవార్డులు నాలుగు విభాగాల్లో ఉన్నాయని, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాల్లో ప్రాముఖ్యతను చూపిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అవార్డులను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 25 జనవరి 2025 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజా పరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను నిర్ణయిస్తారని చెప్పారు. ప్రతీ విభాగంలో పాల్గొనే సంస్థలు తమ ప్రచార సారాంశం, ప్రచురణ లేదా ప్రసారం యొక్క వార్త సంబంధిత ప్రచార కార్యకలాపాలతో సహ నిజప్రతులను సమర్పించాల్సి ఉంటుందన్నారు. 10 డిసెంబరు 2024 లో తమ సిఫార్సులను రాజేష్‌కుమార్‌సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోకరోడ్, న్యూఢిల్లీ 110001 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. ఈ మెయిల్‌లో mediadivision@eci.gov.in పంపవచ్చని హిందీ లేదా ఇంగ్లిష్ కాకుండా ఇతర భాషల్లో ఉంటే ఆంగ్ల అనువాదాన్ని జతపరచాలని తెలిపారు.

కులగణన సర్వే పారదర్శకంగా చేయాలి



సీతంపేటలో సర్వేను పరిశీలిస్తున్న హరిప్రసాద్

గార్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను ఎన్యుమరేటర్లు నిర్ణీత గడువులోపు పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జె.హరిప్రసాద్ సూచించారు. సీతంపేటలో బుధవారం ఎన్యుమరేటర్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటిని వదలకుండా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంగమ్మ, కార్యదర్శులు కిషన్‌నాయక్, అభిలాష్, ఎం శివనాయక్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు


మహబూబాబాద్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగాకుంట ఉపేందర్ మాట్లాడుతూ...గ్రామ పంచాయతీ కార్మికులతో అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనాలిచ్చి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన జీపీ కార్మికులు బతుకులు మారడం లేదన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్న పెండింగ్ వేతనాలను చెల్లించడంతో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెయినుద్దీన్, అప్పిరెడ్డి, సీఐటీయూ నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, ఇనుగుర్తి సుధాకర్, ఉపేంద్రాచారి, వెంకటేశ్వర్లు, కనకలక్ష్మి, సైదులు,వెంకటేశ్వర్లు, మంగిలాల్, సురేష్, దస్తగిరి, ఆదిబాబు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన నెదర్లాండ్ దేశస్థులు



రామప్ప దేవాలయం ఆవరణలో నెదర్లాండ్ దేశస్థులు

వెంకటాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని నెదర్లాండ్‌కు చెందిన ఫ్రాన్స్ ఏరీ వాండెర్లూ, ఇడా తుయిన్‌హోఫ్, లికేవాండెర్లూ బుధవారం సందర్శించారు. ముందుగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని అర్చకుల తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలోని శిల్పకళా సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు.


గుట్టపై ఉన్న సొరంగ మార్గం


ప్రతాపగిరి గుట్ట

చరిత్ర

ప్రతాపగిరి..చారిత్రక సిరి..


గుట్ట మీద 100 మీటర్ల ఎత్తులో ఉన్న రక్షణ దుర్గం ద్వారం

- గుట్టపై కాకతీయుల నాటి రక్షణ దుర్గం
- అబ్బురపరిచే ఐదంచెల్లోని సైనిక స్థావరం
- ప్రధాన ద్వారంపై మైసమ్మ, నాట్యకత్తెల విగ్రహాలు
- కనువిందు చేసే ప్రకృతి రమణీయత
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్న ప్రజలు

కాటారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దట్టమైన అడవిలో ఎత్తైన గుట్ట.. ఆ గుట్టపై రక్షణ దుర్గం.. చుట్టూ గలగల పారే సెలయేళ్లు.. పక్షుల కిలకిలరావాలు.. ఇవన్నీ కాకతీయుల వంశ చివరి రాజు పాలనలో నిర్మించిన 'ప్రతాపగిరి'పై గల చారిత్రక విశేషాలు, ప్రకృతి రమణీయ అందాల మధ్య నెలవైన శతాబ్దాల నాటి చారిత్రక సంపద నేటికీ వెలుగులోకి రాకుండా పోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని 353(సీ)జాతీయ రహదారికి 9 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో సుమారు 600 మీటర్ల ఎత్తులో నెలవైన ప్రతాపగిరి గుట్టపై ఐదంచెల రక్షణ వ్యవస్థతో కూడిన కాకతీయ రాజుల దుర్గం ఉంది. ఎన్నో చారిత్రక విశేషాలకు, ప్రకృతి సంపదకు నెలవైన ఈ 'ప్రతాపగిరి'పై ప్రభుత్వం దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఈ ప్రాంతం వెలుగొందుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ప్రతాపగిరిపై రక్షణ స్థావరం

కాకతీయుల వంశ రాజుల్లో చివరి రాజైన ప్రతాపరుద్ర-2 (రుద్రదేవ-2) కాలంలో ఎత్తైన గుట్టలపై రక్షణ దుర్గాలు ఏర్పాటయ్యాయి. ప్రతాపరుద్రుడి కాలంలో ఏర్పాటు చేసిన నాయంకరుల వ్యవస్థ కీలకంగా ఉండేది. శత్రురాజుల బెడద నుంచి రక్షణ కోసం, అవసరమైతే వారిని దెబ్బ కొట్టడానికి కాకతీయ సేనాని ఆధ్వర్యంలో నాయంకరులు పలు గుట్టలపై బలమైన రక్షణ వ్యవస్థలతో కూడిన కోటలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. 14వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తాన్ సేనల దాడి నుంచి తప్పించుకొని వస్తూ గొంతెమ్మ గుట్టతో పాటు పక్కనే కిలోమీటరు దూరంలో ఉన్న మరో పెద్ద గుట్టపై కాకతీయ వంశ రాజు ప్రతాపరుద్రుడు తన సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆ గుట్టకు ప్రతాపగిరిగా పేరొచ్చింది.


గుప్తనిధుల కోసం తవ్విన ఆనవాళ్లు

చారిత్రక సంపద.. ప్రకృతి అందాలకు నెలవు

గలగల పారే సెలయేర్లు, పచ్చని దట్టమైన వృక్ష సంపద, ప్రకృతి అందాల మధ్య సుమారు 600మీటర్ల ఎత్తులో ఉండే ఈ గుట్టపైకి వెళ్లడానికి మూడు ప్రధాన ద్వారాలున్నాయని, లోపలి ప్రధాన స్థావరానికి తొమ్మిది దర్వాజాలున్నట్లు స్థానికులు చెప్తున్నారు. ప్రధాన ద్వారంపై మైసమ్మ దేవత విగ్రహం ఉండగా, ద్వారానికి ఇరువైపులా నాట్యకత్తెల విగ్రహాలను చెక్కారు. ప్రధాన ద్వారం వద్ద కట్టిన పెద్ద గోడపై రాతి శాసనం ఆనవాలు నేటికీ ఉంది. గుట్ట చుట్టూ సుమారు 5 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మించారు. ఐదంచెల్లో రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ రాతి గోడలు ఏర్పాటు చేశారు. కాకతీయుల సైన్యం స్నానాలు, ఇతర నీటి అవసరాల కోసం గుట్టపై పెద్ద కొలనులను ఏర్పాటు చేశారు. పలు రక్షణ వ్యవస్థలను దాటి శత్రువులు వచ్చినా ప్రధాన స్థావరం వద్ద అడ్డుకోవడానికి చుట్టూ లోతైన కందకాలు తీయించారు. అందులో మొసళ్లను విడిచిపెట్టినట్లు తెలుస్తోంది. ప్రహరీ చుట్టూ సైనికులు నిరంతరం కాపలా కాయడానికి బురుజులు ఏర్పాటు చేశారు. ఈ గుట్ట నుంచి ఇతర చోట్లకు సొరంగ మార్గం ఉన్నట్లు భావిస్తున్నారు. గుట్టపై నుంచి చూస్తే ఎటు చూసినా 20 కిలో మీటర్ల వైశాల్యంలో ఉన్న గ్రామాలు, వాగులు, సెలయేర్లు, గోదావరి నది అందాలు కనిపిస్తాయి.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

శతాబ్దాల నాటి చారిత్రక సంపద విశేషాలు, ప్రకృతి సోయగాలకు నెలవైన ప్రతాపగిరిని ప్రభుత్వం వెంటనే పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. ప్రకృతి రమణీయతల మధ్య కొలువైన ప్రతాపగిరిలో ఎకో టూరిజం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో కొందరు అధికారులు ప్రతాపగిరిని సందర్శించినా ఏ మార్పు లేదు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని యోచిస్తున్న నేపథ్యంలో వందల ఏళ్ల నాటి చారిత్రక విశేషాలు, కాకతీయుల ఆనవాళ్లు గల ప్రతాపగిరిని కాపాడి భవిష్యత్ తరాలకు అందిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, చారిత్రక పరిశోధకులు కోరుతున్నారు.


ద్వారం వద్ద నాట్యకత్తెల విగ్రహం


సైనికుల కాపలాగా ఉండే బురుజు నిర్మాణం

గుప్తనిధుల అన్వేషణతో చారిత్రక సంపద ధ్వంసం

వందల ఏళ్ల నాటి కాకతీయ వంశస్థుల చారిత్రక సంపద గుప్తనిధుల కోసం కొందరు చేసిన, చేస్తున్న అన్వేషణతో ధ్వంసమవుతోందని తెలుస్తోంది. ప్రతాపగిరి గుట్టపై భాగంతో పాటు చుట్టుపక్కల అపారమైన నిధిని దాచినట్లు అపోహలు ఉండటంతో పలు ప్రాంతాలకు చెందిన వారు తవ్వకాలతో చారిత్రక ఆనవాళ్లను శిథిలం చేశారు. గుట్టపై పలు చోట్ల తవ్వకాలు జరిపిన ఆనవాళ్లున్నాయి.

మూడేళ్లలో..

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలోనే జీఎంఆర్ సంస్థతో జరిపిన చర్చ లు ఫలించటంతో 150 కిలో మీటర్ల నిబంధనను సడలించేందుకు ఆ సంస్థ నుంచి సానుకూలత వచ్చిందని సమాచారం.

అనుకూలంగానే స్కై అండ్ ల్యాండ్ సర్వే

2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కే ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్ పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయిం చింది. బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఓఎల్ ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనా మికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతో పాటు మరోసారి గత ఏప్రిల్ 10 నుంచి 25వ తేదీ వరకు ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు సాయిల్ టెస్టింగ్ నిర్వహించారు. మూ డు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టా రు. విమానాల రాకపోకలకు వాతవారణం అను కూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమారు రెండు వారాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూనులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టు లను విజయవంతంగా నిర్వహించారు. వరంగల్ నుంచి అంతర్జాతీయ స్థాయి విమానాలను నడిపించేలా ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయా లని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో రంగంలోకి దిగిన ఏఏఐ అధికారులు మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను పరిశీలించారు. అంత ర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి. మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694 ఎక రాల వరకు భూమి ఉంది. కనీసం మరో 306 ఎకరాల భూమిని కేటాయిస్తే పెద్ద విమానాలు నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ అథారటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. ఇంకా 304ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభు త్వం రంగంలోకి దిగింది. రైతుల నుంచి భూసేక రణకు అధికారులు ప్రయత్నాలు మొదలుపె ట్టారు. అయితే పరిహారం విషయంలోనే సందిగ్ధం నెలకొంది. మొత్తానికి ఎయిర్‌పోర్టుకు అన్ని శుభ శకునాలే వినిపిస్తున్నాయనే ఆనందంలో ఓరుగల్లువాసులు ఉన్నారు.


ఎయిర్‌పోర్టులో సర్వే విమానాలు (ఫైల్)

మంత్రుల ప్రకటనలతో జోష్..

విమానాశ్రాయంపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ ప్రకటనలు చేయటంతో గగనయానంపై ప్రజల్లో ఉత్సాహం నింపింది. బుధవారం ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా అధికారులతో సమీక్ష నిర్వహించడంతో ఎయిర్‌పోర్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందనేది స్పష్టమవుతోంది. పరిశ్రమలన్ని హైదరాబాద్‌కే పరిమితమవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరం గా ఉన్న వరంగల్‌లో మున్ముందు రోజుల్లో పరిశ్రమల స్థాపనకు వ్యాపారులు ముందుకు వస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 140కిలో మీటర్లు రోడ్డు మార్గాన వరంగల్‌కు రావాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతుందనే భావనతో పారిశ్రామికంగా అనుకూల వాతావరణం ఉన్నప్పటికి విమానాశ్రయం లేకపోవటంతో వరంగల్‌లో పరిశ్రమలు రావటం లేదనే చర్చ ఉంది. వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక విదేశీ కంపెనీలు ఆసక్తిగా ఉన్నా.. ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి వరంగల్‌కు ఎయిర్ కనెక్టీవిటీ లేకపోవటంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావటం లేదు. అలాగే మడికొండ ఏరియాలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కూడా ఎయిర్ కనెక్టివిటీ లేకపోవటమే కారణంగా చెబుతున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, మేడారం మహాజాతర, వెయ్యిస్తంభాల దేవాలయం, భద్రకాళి, వరంగల్ కోటతో పాటు అనేక కాకతీయ కట్టడాలను సందర్శించాలనుకునే చాలామంది ఎయిర్‌పోర్టు లేకపోవటంతో వెనక్కుతగ్గుతున్నారు. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ ఎయిర్‌పోర్టుపై వేగంగా అడుగులు వేస్తుండటంతో దశాబ్దాల కల సాకారయ్యే గడియలు సమీపిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


వేదికపై ఐక్యతాభివాదం చేస్తున్న నేతలు

'సదర్' అదుర్స్

- గోకుల్‌నగర్‌లో అంబరాన్నంటిన సంబరం
- విరజిమ్మిన విద్యుత్‌కాంతులు.. అలరించిన ఆట పాట
- ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల విన్యాసం
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్


గోకుల్‌నగర్‌లో సదర్ ఉత్సవానికి హాజరైన జనం

వడ్డెపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ గోకుల్‌నగర్‌లో సదర్ సంబరం అంబరాన్నంటింది. సదర్ సమ్మేళనం వేదిక విద్యుత్ కాంతులతో విరజిమ్మింది. గాయకులు తమ ఆటపాటలతో అలరించారు. ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల విన్యాసం, యాదవ కళాకారులు నృత్యాలు, డోలు వాయిద్యాలతో సందడి చేశారు. ఉత్సవాలకు హాజరైన ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. సదర్ సమ్మేళనంతో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని గోకుల్ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, విశిష్ట అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, యాదవనేత లడ్డూ యాదవ్‌తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని హనుమకొండ ఓల్డ్ బస్ డిపో ప్రాంతంలో గోకుల్ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన సదర్ సమ్మేళనం తొలిసారిగా హనుమకొండ పట్టణంలోని ఓల్డ్ బస్ డిపో ప్రాంతంలో ఏర్పాటు చేసిన గోకుల్ సదర్ సమ్మేళనానికి వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి వందలాదిమంది యాదవులు తరలి వచ్చి ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు. తొలుత దున్నపోతులను ఊరేగింపుగా గోకుల్ సదర్ సమ్మేళనం వేదిక వద్దకు డప్పుచప్పుళ్లు, భాజా భజంత్రీలతో యాదవ సంఘం నేతలు తరలించారు. గొల్ల వేషాధారణలో గొంగళి ధరించిన యాదవ కళాకారులు తమ నృత్యాలతో ఆద్యాంతం ఆకట్టుకున్నారు. జానపద కళాకారులు తమ ఆటపాటలతో అలరింప చేశారు. వేలాది మంది ఉత్సవాలకు తరలి రావడంతో గోకుల్ నగర్ ప్రాంతం సందడిగా మారింది. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దున్నపోతుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బంక సంపత్ యాదవ్, గోకుల్ సదర్ సమ్మేళనం కమిటీ ప్రతినిధులు మూగల కుమార్ యాదవ్, సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు జక్కుల రజిత- వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, బొంగు అశోక్, కుడా మాజీ డైరెక్టర్ నక్క లింగయ్య యాదవ్, యాదవ సంఘం జిల్లా నేతలు బొల్లు సత్యం యాదవ్, బొంగు రాజు యాదవ్, కాశబోయిన దూడయ్య యాదవ్, బంక సరళ యాదవ్, బనుక సిద్దిరాజు యాదవ్, బంక సతీష్, బంక చంద్రశేఖర్, దొంగల చెన్నమల్లు, బంక రమేష్, బుట్టి శ్యామ్, ఎల్లావుల రాజేందర్, బట్టమేకల భరత్, యశ్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి సర్కారు పెద్దపీట : అనిల్‌కుమార్

యాదవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సదర్ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా పేరొందిన వరంగల్‌లో సదర్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్న యాదవులను అభినందించారు. యాదవుల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదవుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవను చూపుతున్నారని అన్నారు. యాదవ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నదని స్పష్టం చేశారు. యాదవులు నిర్వహిస్తున్న సదర్ సమ్మేళనానికి కులమతాలకు అతీతంగా ఎంతో మంది హాజరవ్వడం ఆనందంగా ఉందన్నారు.


దున్నపోతుపై డ్యాన్స్ చేస్తున్న బాలుడు

ఆచార్య అనుగ్రహంతో ఏదైనా సాధ్యమే..

హనుమకొండ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సద్గురు, ఆచార్యుల అనుగ్రహంతో ఎంత పెద్ద కార్యానైనా అవలీలగా సాధించవచ్చునని త్రిదండి ఆహోబిల రామానుజ జీయర్‌స్వామి అన్నారు. బుధవారం సాయంత్రం హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వికాస తరంగిణి ఉభయ జిల్లాల సదస్సులో ఆయన పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. ఈ నెల 1 నుంచి 5 తేదీ వరకు హైదరాబాద్‌లోని ముచ్చింతలలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి 69వ తిరునక్షత్రోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించుకోవడం ఆచార్యుడి కృపతోనే సాధ్యమైందన్నారు. ఇందులో భాగంగా వరంగల్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో తదియారాధన నిర్వహించేందుకు వరంగల్ భక్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. చినజీయర్ స్వామి వారికి ఓరుగల్లుతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని, వికాస తరంగిణితో పాటు ఆచార్య సేవా యాత్ర లాంటి ఏ కార్యక్రమాన్నైనా విజయవంతంగా నిర్వహించడంలో ఇతరశాఖలకన్నా ముందుండడం ఆనందదాయకమన్నారు. మానవ సేవయే మాధవ సేవగా వికాస తరంగిణి నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తిరునక్షత్రోత్సవ ప్రసాదాలను పంపిణీ చేశారు. వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమంలో ఉపాధ్యక్షుడు చాడా సుభాష్‌రెడ్డి, ప్ర. దాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కోశాధికారి ముర ళీధర్‌రెడ్డిలతో పాటు సుమతి వరదారెడ్డి, తను జారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అనుగ్రహ భాషణం చేస్తున్న ఆహోబిల జీయర్ స్వామి



ముక్తీశ్వరాలయంలో లక్ష దీపోత్సవం

మహదేవపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. బుధవారం లక్ష దీపోత్సవంతో పాటు భక్తులు లక్షపత్రి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే గోదావరిలో కార్తీక స్నానాలు ఆచరించి.. గోదావరి మాతకు పాలు, పసుపు, కుంకుమ, చీర సారెలతో పూజలు చేశారు.

ఆరోగ్య పరిరక్షణకు

మీకోసం

ఆయుష్మాన్ భవ



- వయో వృద్ధుల కోసం అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- కార్డుల జారీకి కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 70ఏళ్లు పైబడినవారు 2.69 లక్షల మంది

హనుమకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం నిరుపేదలకు ఉచిత వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తున్న రీతిలోనే ప్రత్యేకంగా 70ఏళ్లు పైబడిన వారి ఆరోగ్య రక్షణ కోసం కూడా కార్డులను ఇవ్వబోతోంది. ఈ కార్యక్రమం గత నెల 29వ తేదీ నుంచి అమలు చేస్తుండగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా 70ఏళ్లు పైబడిన వృద్ధులకు రూ.5లక్షల మేరకు ఉచిత ఆరోగ్య పథకాన్ని ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) అందుబాటులోకి తీసుకొచ్చారు.

రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం

ఉమ్మడి జిల్లాలో సుమారు 2.69లక్షల మందికి 70ఏళ్లు పైబడిన వారు ఈ అయుష్మాన్ భవ పథకం కింద లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా అన్ని వయసుల వారికి రూ.10 లక్షల వరకు వైద్య సేవలను అందిస్తోంది. ఈ పథకం కింద 1,835 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. కేంద్రం ప్రస్తుతం ప్రారంభించిన ఆయుష్మాన్ భవ పథకాన్ని వృద్ధులకు కేంద్రం అందజేస్తోంది. దీంతో ఈ పథకం కింద ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్ కేర్ తదితర సేవలను పొందవచ్చు. ఉచితంగా మందులు, పోషకాహారం సైతం అందజేస్తారు. ఈ పథకం కోసం వృద్ధులు పూర్తి వివరాలతో వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

హెల్త్ ఇన్సూరెన్స్ కలిగిన వారికి కూడా..

ఇప్పటికే ఆయుష్మాన్ కార్డు కలిగి ఉన్న వృద్ధులు ఆయుష్మాన్ పోర్టల్ లేదా యాప్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకొని కొత్త కార్డు కోసం ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు లేదా ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను పొందు తున్న సీనియర్ సిటిజన్లు కూడా ఈ పథకం కింద ప్రయోజనాలు పొందేందుకు అర్హులు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్), ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం (ఈసీహెచ్ ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సు (సీఏపీఎఫ్) వంటి ఇతర పబ్లిక్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లను ఉపయోగిస్తున్న 70 ఏళ్లపైబడిన సీనియర్ సిటిజన్లు ప్రస్తుత పథకం లేదా ఆయుష్మాన్ భారత్ స్కీంలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

2.69 లక్షల మంది..

హనుమకొండ జిల్లాలో 56,656 మంది, వరంగల్ జిల్లాలో 58,995, జనగామ జిల్లాలో 42,277, మహబూబాబాద్ జిల్లాలో 47,833, ములుగు జిల్లాలో 31,622, జయశంకర్ భూపాపల్లి జిల్లాలో 32,599 మంది ఉన్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కింద వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 11,14,841 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో వరంగల్ జిల్లాలో 1,75,682 మంది, హనుమకొండ జిల్లాలో 2,90,664, మహబూబాబాద్ జిల్లాలో 1,97,304, జనగామ జిల్లాలో 1,85,619, ములుగు జిల్లాలో 1,32,783 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,32,789 మంది ఉన్నారు. వీరందరికి గుర్తింపు కార్డులు జారీ అయ్యాయి.



ఇళ్ల వద్దే ఆరోగ్య పరీక్షలు

ఆయుష్మాన్ భారత్ కింద పేర్లు నమోదైన వయోవృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల వివరాలను ఆయుష్మాన్ భవ ఖాతాలో నమోదు చేస్తారు. ఆసుపత్రికి వెళితే వాటిని పరిశీలించి డాక్టర్లు వైద్యం అందజేస్తారు. ఏదైనా సందర్భంలో వేరే ఆసుపత్రులకు వెళ్తే రోగుల వద్ద పాత వైద్య రిపోర్టులు లేకపోయినా ఆయుష్మాన్‌భవ హెల్త్ ఖాతా సంఖ్య ఆధారంగా వైద్యులు చికిత్స అందజేస్తారు.

ఆన్‌లైన్‌లో ఆరోగ్య వివరాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి గుర్తింపు కార్డులను కేటాయించింది. ఆరోగ్య శ్రీ, ఆధార్ కార్డు మాదిరిగా ఆరోగ్య గుర్తింపు కార్డు పనిచేస్తుంది. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద 70 ఏళ్ల వయసుపైబడిన వారికి కూడా ఇలాగే కార్డులను జారీ చేస్తారు. వారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ కార్డు ద్వారా దేశంలోని ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలోనైనా వైద్య సేవలు పొందవచ్చు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో కె.రాము అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక ధర్మకంచ ఉన్నత పాఠశాలలో రగ్బీ, ఫుట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు పీడీ నరేందర్ తన తండ్రి జ్ఞాపకార్థం క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు, లింగం పాల్గొన్నారు.

నేడు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు బి.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ టాలెంట్ టెస్టు నిర్వహిస్తామని, ఇప్పటికే పాఠశాలలకు ప్రశ్నాపత్రాలు పంపించినట్లు పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు మండల స్థాయికి ఎంపికవుతారని అన్నారు.

విద్యార్థులకు భరోసా అవగాహన కార్యక్రమం

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లకొండ ఉన్నత పాఠశాలలో భరోసా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు 'భరోసా' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయవాదులు పాల్గొని మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల దృష్ట్యా పిల్లలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే మంచి నడవడికతో పాటు ఎలాంటి తప్పులు చేయకుండా చదువు కొనసాగించాలని సూచించారు. న్యాయవాదులు ఎం.స్వప్న, జి.కవిత, జి.దయామణి, బి.సోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

పాలకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరులో ఎండి వలీబాషా ఇంట్లో నిలువ ఉన్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకొని పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన ఎండి.వలీబాషా ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిలువ ఉన్నాయనే సమాచారం మేరకు దాడి చేశామన్నారు. బియ్యంను స్వాధీనం చేసుకొని వలీబాషా, సిరాజ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడా దుస్తులు పంపిణీ

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు జనగామ ఏసీపీ పార్థసారథి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. జనగామ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఈనెల 7, 8, 9 తేదీల్లో యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగంలో కబడ్డీ క్రీడలకు ఎంపికయ్యారు. కాగా, బుధవారం జనగామ ఏసీపీ కార్యాలయంలో వారికి క్రీడా దుస్తులు అందించి మాట్లాడారు. చక్కని ప్రతిభ కనబరిచి గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ధర్మకంచ హైస్కూల్ పీడీ పోగుల నరేందర్‌గౌడ్, నర్మెట మండల కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ తేజావత్ మోహన్, జనగామ జిల్లా సీనియర్ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నేనావత్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా బెల్లంకొండ

బచ్చన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా తమ్మడపల్లికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్ రెండవసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యపై పోరాటాలు చేస్తున్న సీపీఎంను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో పోటీ పడి ఉచిత హామీలు ఇచ్చి అమలులో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. మండలంలో సీపీఎం పటిష్టతకు కృషి చేయనున్నట్టు తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బాల్‌రాజు

బచ్చన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడిగా బచ్చన్నపేటకు చెందిన వేముల బాల్‌రాజు నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ నియామక ప్రకటన చేశారు. సామాన్య కుటుంబంలో పుట్టిన బాల్‌రాజు ఎంపీపీగా మండల ప్రజలకు సేవలందించారు. సంఘంలో జిల్లా, రాష్ట్ర శాఖల్లో పలు పదవులు చేపట్టి పద్మశాలీల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లటంలో విశేష కృషి చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి బాల్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

ఆటోలో మరిచిపోయిన బ్యాగు ప్రయాణికుడికి అప్పగింత

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ఓ ప్రయాణికుడు మరిచిపోయిన మూడు తులాల బంగారం కలిగి ఉన్న బ్యాగును అతనికి అందించి మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన మారపాక శ్రీనివాస్ అనే ఆటో డ్రైవర్ ఔదార్యాన్ని చాటారు. వివరాలిలా ఉన్నాయి. కొత్తపల్లికి చెందిన కొండల్‌రెడ్డి తాటికొండకు వెళ్లే ఆటోను ఘన్‌పూర్‌లో బ్యాగుతో మంగళవారం రాత్రి ఎక్కాడు. కొత్తపల్లిలో ఆటో దిగి బ్యాగును ఆటోలోనే మరిచిపోయి వెళాడు. ఆటో డ్రైవర్ తాటికొండ గ్రామానికి వెళ్లి చూడగా బ్యాగు కనిపించింది. బ్యాగును తెరిచిచూడగా అందులో 3 తులాల బంగారు నగలు కన్పించాయి. తాటికొండకు చెందిన మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములకు విషయం తెలిపాడు. ఇద్దరు కలిసి ఆటోలో వచ్చిన ప్రయాణికుల వివరాలు తెలుసుకొని బ్యాగు మరిచిపోయిన వ్యక్తి కొత్తపల్లికి చెందిన కొండల్‌రెడ్డిగా గుర్తించి పిలిపించి బ్యాగును అందించారు. దీంతో ఆటో డ్రైవర్ మానవత్వాన్ని మెచ్చుకున్న గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు.

అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరి సింధూజ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన అతిథి అధ్యాపకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అతిథి అధ్యాపకులకు నెలల తరబడి వేతనాలు లేకపోవడం వల్ల కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతూ బాధ్యతలు నిర్వర్తించడం వలన మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ క్రమంలోనే కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రాధ అనే అతిథి అధ్యాపకురాలు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇబ్బంది పడుతూ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వేతనాలు రాక అధ్యాపకులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నెలకు రూ.42వేల వేతనం 12 నెలల పాటు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంత్రులను గాంధీ భవన్‌లో కలిసి విన్నవించామన్నారు. ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న సలహా మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి అతిథి అధ్యాపకుల జీవితాలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో స్రవంతి, సతీష్, రాజు, దేవేందర్, ఇస్సాక్, రాజు, వసీమా పాల్గొన్నారు.

సీపీఐ నేతకు ఘన నివాళి

హాజరైన రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్


సభలో మాట్లాడుతున్న బాలమల్లేశ్

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీపీఐ నాయకుడు మంగళపల్లి జనార్దన్ సంతాప సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సొప్పరి సోమయ్య అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, జనగామ జిల్లా సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడిగా, బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడిగా సేవలందించిన జనార్దన్ మరణం పేద ప్రజలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరని నష్టమన్నారు. జనార్దన్ చిన్నతనం నుంచే కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై సీపీఐలో చేరి అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారన్నారు. జనార్దన్ ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, మహిళా సంఘం నాయకురాలు పాతూరి సుగుణమ్మ, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సాయిలుగౌడ్, అశోక్, మోటె శ్రీశైలం, రావుల సదానందం, బిట్ట బాబు, మచ్చ బాలనర్సయ్య, వైకుంఠం, లక్ష్మీనర్సయ్య, జి.సఖి పాల్గొన్నారు.

సర్వేను సమగ్రంగా నిర్వహించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా


ఘన్‌పూర్‌లో ఇంటింటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీవో స్వరూప

పాలకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కుల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ నిజం చెప్పే విధంగా సర్వే చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఏరియాలో సర్వేను కలెక్టర్ పరిశీలించి ఓ ఇంటికి వెళ్లి స్టిక్కర్‌ను అంటించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలోని అన్ని ప్రశ్నలకు సమాధానాలను సమగ్రంగా పొందుపరచాలని అధికారులకు సూచించారు. ఫారంలో ఉన్న 75 ప్రశ్నల సమాధానాలకు నిజాలు మాత్రమే రాసే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. రెండు రోజులు ఇంటిని గుర్తించి ప్రతి ఇంటికి స్టిక్కర్ వేయించాలని ఆదేశించారు. ఆతర్వాత కుల సర్వేను చేపట్టాలని అన్నారు. కొంత మంది వలస వెళ్లిన వారు అందుబాటులో లేకుంటే ఆ ఇంట్లో ఒక్కరున్నా పూర్తి వివరాలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండగడప సుశీల, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఆర్ఐ రాకేష్, పంచాయతీ కార్యదర్శి కపిలవాయి వెంకటేశ్వరాచారి పాల్గొన్నారు.

- లింగాలఘణపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. బుధవారం మండలంలోని నెల్లుట్ల గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ ఎన్యుమరేటర్లు ఇంటింటికి వేసిన స్టిక్కరింగ్‌లను పరిశీలించారు. స్థానికులతో కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ఉద్దేశ్యం, అధికారుల సర్వే తీరుపై అవగాహన కల్పించారు. ప్రతీ 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించడం జరిగిందని వాళ్లు ప్రతీ ఇంటికి వచ్చి సర్వే వివరాలను సేకరిస్తారని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.
- బచ్చన్నపేట: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా సర్వే కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మండల కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ రామారావు నాయక్, ఎంపీడీవో మల్లిఖార్జున్, ఎంఈవో వెంకటరెడ్డిలు సర్వేను ప్రారంభించారు. సర్వే చేసిన ఇళ్లకు స్టిక్కర్లను వేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నల్లగోని బాలకిషన్‌గౌడ్, మహాత్మాచారి పాల్గొన్నారు.
- కొడకండ్ల: మండలకేంద్రంలో జరుగుతున్న సర్వేను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలతో మాట్లాడుతూ ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవీందర్, తహసీల్దార్ చంద్రమోహన్, ఎంపీడీవో నాగశేషాద్రిసూరి, ఇన్‌చార్జ్ ఎంపీవో ఇందిర తదితరులు పాల్గొన్నారు.
- నర్మెట: మండల కేంద్రంతో పాటు బొమ్మకూరులో జరుగుతున్న సర్వేను జడ్పీ సీఈవో మాధురి షా పరిశీలించారు. ఈనెల 8 వరకు ఇళ్ల జాబితాను సిద్ధం చేసి 9వ తేదీ నుంచి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తారన్నారు. మండల పరిధిలో 5,850 ఇళ్లకు గాను 41 మంది ఎన్యుమరేటర్లను, నలుగురు సూపర్‌వైజర్స్ కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామానుజచారి, ఎంపీడీవో అరవింద్, కార్యదర్శులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.
- చిలుపూర్: మండలంలోని లింగంపల్లిలో సర్వేలో భాగంగా చేపడుతున్న స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని డీపీవో స్వరూపరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్యుమరేటర్లకు కేటాయించిన ప్రతీ ఇంటిని సందర్శించి కుటుంబ యాజమానితో పాటు, సభ్యుల వివరాలను వారికి కేటాయించిన బుక్‌లెట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపాద మధుసూదన్, పంచాయతీ సెక్రటరీ రంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఏదునూరి రవిందర్, వైష్ణవి, ఏదునూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌లో సర్వే ప్రక్రియను మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రాధాకృష్ణ, ఎంపీడీవో సుమన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇంటింటి కుటుంబ సర్వేకు గాను మొత్తం 74 మంది ఎన్యుమరేటర్లను నియిమించారన్నారు. ఈనెల 9 వరకు ఆయా వార్డుల్లో ఇళ్లను, కుటుంబాలను గుర్తించే ప్రక్రియను చేపడతారన్నారు. 10వ తేదీ నుంచి సమగ్ర సర్వే చేపడతారన్నారు. ఈ సర్వేలో ఉపాధ్యాయులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు భాగస్వాములవుతారన్నారు.
- స్టేషన్‌ఘన్‌పూర్: సర్వే విజయవంతానికి ప్రజల సహకారం ఉండాలని డీపీవో నాగపూరి స్వరూప తెలిపారు. కుటుంబాల గుర్తింపులో భాగంగా ఎన్యుమరేటర్లు చేపట్టిన ఇంటింటి స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని మండలంలోని తాటికొండ, మీదికొండ, కొత్తపల్లి, ఛాగల్ ఘన్‌పూర్, శివునిపల్లి, ఇప్పగూడెం, గ్రామాల్లో డీపీవో బుధవారం పరిశీలించారు. 10 రోజుల పాటు జరిగే సర్వేను సమర్థవంతంగా సిబ్బంది పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, ఏఈ యాసర్, సెక్రటరీలు సత్యనారాయణ, లింగయ్య, నర్మద, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


పాలకుర్తిలో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న కలెక్టర్


కొడకండ్లలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్


బొమ్మకూరులో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో మాధురి షా

హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి నివాళి

దేవరుప్పుల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవరుప్పుల మండల పీహెచ్‌సీలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ ఇస్తారి రాజశేఖర్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈసందర్భంగా మాధాపురం గ్రామంలో రాజశేఖర్ భౌతికకాయాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడుతూ కరోనా సమయంలో పలు గ్రామాల్లో రాజశేఖర్ అందించిన సేవలు మరిచిపోలేనివని గుర్తుచేశారు. హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రజలకు చేరువగా ఉంటూ అనారోగ్యానికి గురైన వారికి ఉచిత మందులు పంపిణీతో పాటు పలు సూచనలు చేసేవాడన్నారు. ఒక మంచి వ్యక్తిని మండలం కోల్పోవాల్సి వచ్చిందన్నారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చింత రవి, జేరిపోతుల సాయిలు, మజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ముప్పు

సీపీఎం రాష్ట్ర నాయకుడు అబ్బాస్



మహాసభలో మాట్లాడుతున్న ఎండి. అబ్బాస్

జనగామ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి.అబ్బాస్ అన్నారు. బుధవారం జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌లో సీపీఎం మండల 8వ మహాసభ జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా షైలారం వెంకటయ్యగౌడ్ జెండావిష్కరణ చేశారు. అనంతరం పొత్కనూరి ఉపేందర్, రమావత్ మీట్యా నాయక్ ఆధ్వర్యంలో జరిగిన మహాసభకు అబ్బాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం జమిలి ఎన్నికలు తీసుకురావాలని సూచిస్తుందన్నారు. దీనివల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే పెను ప్రమాదం ఉందన్నారు. ప్రజలు ప్రశ్నించే హక్కు కోల్పోతారన్నారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక వల్ల డబ్బులు ఉన్నవారే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రాలు హక్కులు కోల్పోయే ప్రమాదముందన్నారు. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ పదేళ్లుగా ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టి మహిళలపై అత్యాచారాలు, దళితుల ఊచకోతలు దేశంలో పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 6 గ్యారంటీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సాంబరాజు యాదగిరి, బోడ నరేందర్, బూడిద గోపి, సుంచు విజేందర్, జోగు ప్రకాశ్, బైరగోని మల్లేశ్, గుండెల్లి రాజు, బాలరాజు, బోడ రాములు, శ్రీరాములు, మల్లేశ్, కూరాకుల శ్రీను, కిష్టయ్య పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు లయన్స్ క్లబ్ సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శివునిపల్లి పట్టణానికి చెందిన చిత్రకారుడు, గాయకుడు లయన్ ఎం.ఉపేందర్ జాతీయ స్థాయి గౌతమీ స్వర్ణ నంది పురస్కారం 2024 అవార్డును అందుకున్న నేపథ్యంలో ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. స్టేషన్ ఘన్‌పూర్ లయన్స్ భవన్‌లో క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కిషన్‌రాజు మాట్లాడుతూ ఉపేందర్ జాతీయ అవార్డు పొందడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు కూరెల్లి కృష్ణమూర్తి, వి.టి.శ్రీనివాస్, పి.వెంకటేశం, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, సామల ఉపేందర్, వైకుంఠం, హరికిషన్‌రెడ్డి, ఎ.మధు, గట్టు రమేశ్, జి.సంపత్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


నష్కల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

చిలుపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు పర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం మండలంలోని నష్కల్, వెంకటాద్రిపేట గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులెదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదన్నారు. ప్రజలకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. రుణమాఫీతో పాటు, రైతు భరోసా, రైతు బీమా, కల్యాణలక్ష్మికి తోడు తులం బంగారం, మహిళలకు రూ.2500, ఆసరా పెన్షన్ల పెంపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. తన పదవిని కాపాడుకోవడంలో భాగంగా ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టేందుకే సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన మొదలు పెట్టారన్నారు. దీంతో నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అవకాశవాదానికి మారుపేరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై త్వరలో అనర్హత వేటు పడడం ఖాయమని పేర్కొన్నారు. ఉప ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ మాలోతు రమేష్‌నాయక్, నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు, ఆరూరి స్వామి, చిర్ర రాజు, ఆరూరి బాలస్వామి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని రాజవరంలో అనారోగ్యంతో మృతిచెందిన ఎడ్ల రమ్య, కన్నెబోయిన బక్కయ్య, చిన్నపెండ్యాలలో ఇటీవల మృతి చెందిన పొత్కనూరి సుగుణ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మాలోతు రమేష్‌నాయక్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, బత్తుల రాజన్‌బాబు, మోటం రాములు తదితరులు పాల్గొన్నారు.

- జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లులో అనారోగ్యంతో మృతి చెందిన ఎర్రం కుమారస్వామి మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్యే రాజయ్య నివాళులర్పించారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కుమారస్వామి శవయాత్రలో పాల్గొని కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ పి.మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మారపాక రవి, నాయకులు పులి ధనుంజయ్‌గౌడ్, నాయిని నరేశ్ గౌడ్, ఎర్రం రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

(5వ పేజీ తరువాయి)

అవకాశం ఉందని ఐకేపీ సిబ్బందిని, రైతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలును ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామానుజచారి, ఆర్ఐ సాయిబాబా, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

పాలకుర్తి: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం పాలకుర్తి, తొర్రూరు, శాతాపురం, ఈరవెన్ను గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు వడ్లను దళారులకు విక్రయించవద్దని సూచించారు. మాయిశ్చర్ వచ్చే వరకు వడ్లను ఆరబోయాలని రైతులకు సూచించారు. రెండు రోజుల్లోనే ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాకేష్, పీఏసీఎస్ చైర్మన్ గోనె మైసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీకాల లక్ష్యం వంద శాతం సాధించాలి

(5వ పేజీ తరువాయి)

ఉప కేంద్రాల్లో ఏబీహెచ్‌ఏ కార్డు జనరేషన్ పెంచాలన్నారు. సీ సెక్షన్ రేటు తగ్గే విధంగా గర్భిణులకు యోగా విషయాలు నేర్పించాలని సూచించారు. అదే విధంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి ఎం.ప్రభాకర్, ఇమ్యూనైజేషన్(ఇన్‌చార్జ్) సెక్షన్ ఆఫీసర్ పి.జయపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి పూజ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ డెలివరీకి చర్యలు తీసుకోవాలి

లింగాలఘణపురం: గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించి సాధారణ డెలివరీ అయ్యే విధంగా అవసరమైన చర్యలను తీసుకోవాలని తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని నెల్లుట్ల ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పని తీరుతో పాటు వైద్యసేవలను, రికార్డుల నిర్వహణను, వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, చిన్న పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను సకాలంలో వేసి నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. టీకాలను వేసిన డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంసీహెచ్ పోర్టల్‌తో పాటు హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ ద్వారా అందే సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రధానంగా గర్భిణులకు 1,2,3,4వ పరీక్షలు సకాలంలో నిర్వహించి రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యోగా, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించి సాధారణ డెలివరీకి అవసరమైన చర్యలను తీసుకోవాలని ఏఎన్‌ఎం సంపూర్ణ, సరస్వతికి సూచించారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ ఇన్‌చార్జ్ జయపాల్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంప్

బచ్చన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్కూరు గ్రామంలో ఆర్వీఎం ఆస్పత్రి నేతృత్వంలో బుధవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నల్లనాగుల వెంకటాచారి క్యాంప్‌ను ప్రారంభించగా, 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు సమస్యలతో బాధపడుతున్న వారిని ఆస్పత్రికి రావల్సిందిగా సూచించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పుట్ట నర్సింహులు, నాయకులు బొజ్జ వెంకటేశ్, టేకులపల్లి రవి, వైద్యులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి పుస్తెలతాడు బహూకరణ

పాలకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చండికా అమ్మవారికి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన భక్తులు 29 గ్రాముల బంగారు పుస్తెలతాడును బుధవారం ఆలయ అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా భక్తులు గోలి వెంకన్న, సుజాత, అరవింద్, భానుప్రియ, చల్లా మనోహర్, భవాని దంపతులు మొక్కులు చెల్లించేందుకు సోమేశ్వరాలయానికి వస్తుంటామని తెలిపారు. తాము కోరిన కోర్కెలు తీరినందుకు అమ్మవారికి రూ.2లక్షల 30వేల విలువ గల పుస్తెలతాడును అధికారులు, అర్చకులకు అందచేసినట్లు పేర్కొన్నారు.

మహిళ మృతిపై బాధిత కుటుంబీకుల ధర్నా


జఫర్‌గడ్‌లో బ్రాందీ షాపు ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించిన బాధిత కుటుంబీకులు

జఫర్‌గడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జఫర్‌గడ్ శివారు నల్లబండ క్రాస్ వద్ద గల బ్రాందీ షాపు ఎదుట ప్రధాన రహదారిపై బాధిత కుటుంబీకులు బుధవారం ధర్నా నిర్వహించారు. దళిత కుటుంబీకులు, మహిళలు రోడ్డుపై సుమారు మూడు గంటల పాటు బైఠాయించి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. మంగళవారం జఫర్‌గడ్ శివారులో ఆటో ఢీకొన్న ఘటనలో వడ్డెగూడెం దళిత కాలనీకి చెందిన బండ్ల యేసుమణి(55) అనే మహిళ మృతి చెందిన విషయం విదితమే. అయితే స్థానిక బ్రాందీ షాపులో పనిచేసే వ్యక్తి ఆటోలో మద్యం బాటిళ్లను బెల్టుషాపులకు తీసుకువెళుతూ అజాగ్రత్తగా నడిపి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై కూర్చున్న యేసుమణి కిందపడి తీవ్ర గాయాలతో చనిపోయిందని, బైక్ నడుపుతున్న ఆమె కుమారుడికి గాయాలయ్యాని బాధిత కుటుంబీకులు తెలిపారు. ఈ ఘటనపై తమకేమి సంబంధం లేనట్లు బ్రాందీ షాపు యజమానులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా బ్రాందీ షాపు యజమానులు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళ మృతికి కారకులను శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఘటనపై కేసు నమోదు చేశామని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మహిళ ప్రాణం బలిగొన్న వారిపై చర్యలు తీసుకోవాలి

జనగామ కల్చరల్ : జిల్లాలోని జఫర్‌గడ్ మండల కేంద్రంలో మహిళ ప్రాణం బలిగొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో బెల్టు షాపులు నివారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఎం దశల వారీ ఉద్యమాలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల అండతో లిక్కర్ మాఫియా రెచ్చిపోతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెడింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఘన్‌పూర్ మండల పరిధిలోని ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు ఎమ్డీ.దస్తగిరి మాట్లాడారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి రాగానే పెన్షనర్స్ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి 11 నెలలు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెండిగ్‌లో ఉన్న 5 డీఏలలో ఒకటి మాత్రమే ఇస్తామనడం బావ్యం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆర్డీవోకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కోతి భిక్షపతి, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సరసిజ, దీనమ్మ, వెంకటయ్య, కొమురెల్లి, కొమురయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు